సాక్షి చిత్తూరు

సోమవారం ¦ 1 ¦ జనవరి ¦ 2024



కోలాహలంగా మైలేరు

పలమనేరు మండలం నూనేవారిపల్లెలో ఆదివారం మైలేరు పోటీలు కోలాహలంగా జరిగాయి. - IIలో



సీఎం జగనన్నతోనే సంక్షేమం

అన్ని వర్గాల సంక్షేమం సీఎం జగనన్నతోనే సాధ్యమైందని ఎస్సీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు బసవరాజు తెలిపారు. - IIలో



ప్రజలతో సామరస్యంగా మెలగాలి

ప్రజలతో సామరస్యంగా.. చట్టంపై గౌరవం పెంపొందేటట్లు మెలగాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి సూచించారు. - IIలో

న్యూస్‌రీల్

ప్రతి ఇంటా ఆనందాలు నిండాలి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి ఆర్కే రోజా

తిరుపతి అర్బన్/చిత్తూరు కలెక్టరేట్: 2024లో ప్రతి ఇంటా ఆనందాలు నిండాలని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, విద్యుత్ శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, క్రీడా శాఖామంత్రి ఆర్కే రోజా ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఇంకా రాజంపేట, తిరుపతి, చిత్తూరు ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మద్దెల గురుమూర్తి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు కే.వెంకటరమణారెడ్డి, షణ్మోహన్, ఎస్పీలు పరమేశ్వర్‌రెడ్డి, రిషాంత్‌రెడ్డి, జేసీలు శుభం భన్సల్, శ్రీనివాసులు, డీఆర్వోలు పెంచలకిషోర్, రాజశేఖర్ శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ దైవానుగ్రహం సంపూర్ణంగా లభించాలని ఆకాంక్షించారు.

భక్తజన బోయకొండ



ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్యదైవంగా పేరొందిన బోయకొండ శ్రీగంగమ్మ ఆలయం ఆదివారం భక్తజనకొండగా మారింది. వేకువ జామునే అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలి రావడంతో క్యూలన్నీ రద్దీగా మారాయి. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దీవెలతో విచ్చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం చైర్మన్ నాగరాజ రెడ్డి, ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో తీర్థప్రసాదాలను అందజేశారు. బోయకొండ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

వెండి నాగపడిగ, కిరీటం కానుక



నాగపడిగ, కిరీటం అందజేస్తున్న దాతలు

పుత్తూరు: సదాశివకోనలోని శ్రీసదాశివేశ్వర స్వామికి ఆదివారం వెండి నాగపడగ, కిరీటం కానులుగా అందాయి. చెన్నై పూందమల్లైకి చెందిన ఎస్.బాలమురగన్, ఎస్.శారద, టి.సెంథిల్ మురగన్ రూ.2.50 లక్షలు విలువ చేసే వెండి నాగపడిగ, కిరీటాన్ని ఆలయానికి బహూకరించారు. ఆలయ కమిటి చైర్మన్ ఎంఏ జయచంద్రన్‌కు వాటిని అందజేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేసి నూతన ఆభరణాలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల జనవరి ఒకటిన రద్దు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా ప్రజలను గమనించి వ్యయప్రయాసలకు ఓర్చి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

మాజీ సైనికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మాజీ సైనికుల పిల్లలకు ప్రధానమంత్రి స్కాలర్ షిప్‌లను కేంద్రం అందజేస్తోందని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 2006-07 సంవత్సరం నుంచి ఈ స్కాలర్‌షిప్‌లను అందజేస్తోందన్నారు. బాలురకు రూ.30 వేలు, బాలికలకు రూ.36 వేలు అందజేస్తోందని తెలిపారు. ఇందుకు 2023-24 సంవత్సరంలో బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, బీసీఏ, ఎంసీఏ, బీ ఫార్మసీ తదితర కోర్సుల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. జనవరి 1 వ తేదీ నుంచి 5వ తేదీ లోపు ksb.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నవశకం

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్యాన్ని ప్రభుత్వం రోగుల చెంతకే చేర్చింది. పల్లెపల్లెకు ఆరోగ్య భరోసా కల్పిస్తోంది. చాప కింద నీరులా గ్రామాల్లోనూ విస్తరిస్తున్న జీవన శైలి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి అరికట్టే లక్ష్యంతో విలేజీ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పూతలపట్టు నియోజకవర్గంలో 75 విలేజీ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ఇంటిముంగిటే వైద్య సేవలు అందుతుండడంతో గ్రామీణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏచిన్నపాటి రోగానికైనా జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేదని..ఆ బాధలు తప్పాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌తో ప్రజల ఆరోగ్యానికి భరోసా
- పూతలపట్టు నియోజకవర్గంలో 75 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- 12రకాల సేవలు..14 పరీక్షలు.. 105 రకాల మందులు
- రోగుల వైద్య పరిస్థితిని పరిశీలిస్తు వైద్య సిబ్బంది పరామర్శలు
- గ్రామీణుల జీవన శైలి జబ్బులు ఆదిలోనే కట్టడి



తవణంపల్లె: టి.పుత్తూరులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం



దిగువ మోదలపల్లెలో వైద్య పరీక్షలు

పల్లె చెంతకు వైద్యం

తవణంపల్లె: పూతలపట్టు నియోజకవర్గంలో వైఎస్సార్ విలేజీ క్లినిక్‌లు సత్ఫలితాలను ఇస్తున్నాయి. క్లినిక్‌లలో వివిధ రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు(ఎంఎల్‌హెచ్‌పీ)లు సేవలు అందిస్తున్నారు. జీవనశైలి వ్యాధులైన బీపీ, నరాలు, గుండె జబ్బులు, పక్షపాతం తదితరాలు ప్రాథమిక దశలో గుర్తించకుంటే ప్రాణాంతంగా మారే అవకాశాలు ఉన్నాయి. షుగర్‌కు సరైన సమయంలో చికిత్స చేయకుంటే కిడ్నీ సమస్యలకు దారి తీస్తుంది. ఇలాంటి వాటికి సొంతూరులోనే మెరుగైన వైద్య సేవలు అందిస్తే నియంత్రణ సాధ్యమవుతుంది. సరిగ్గా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఈ పని చేస్తున్నాయి. వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలను విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో నిత్యం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సిబ్బంది అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రజలకు సూచనలు, సలహాలిస్తూ ఉచితంగా మందులు అందిస్తున్నారు. క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు రోగులకు చికిత్స అందిస్తున్నారు. ప్రధానంగా షుగర్, బీపీ, రక్తహీనత పరీక్షలు చేస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నయం కాని జబ్బులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేస్తున్నారు. నియోజకవర్గంలో 75 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో 32 భవనాలు పూర్తి కాగా, మిగిలిన భవనాలు వివిధ దశలో పనులు జరుగుతున్నాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20.08 లక్షలు నిధులు మంజూరు చేశారు. భవనాలు లేని చోటు ప్రభుత్వ కార్యాలయాల్లో క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో వైద్య సేవలు



విలేజీ క్లినిక్‌లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. జ్వరం వచ్చినా వెంటనే పరీక్షలు చేసి నివారణకు మందులు ఇస్తున్నారు. ఎలాంటి రోగాలు వచ్చినా క్లినిక్‌లో చూపించుకుని గ్రామస్తులు నయం చేసుకుంటున్నారు.

-మీనా, దిగువ మోదలపల్లె

షుగర్ మందులు ఇంటికే..



గతంలో షుగర్ పరీక్షల కోసం జిల్లా కేంద్రంలోని చిత్తూరుకు వెళ్లే వాళ్లం. ఇప్పుడు పల్లెలోనే విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా వైద్య సిబ్బంది షుగర్ పరీక్షలు చేస్తున్నారు. సకాలంలో మందులు ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. ఉచితంగానే మంచి వైద్యం అందుతోంది.

- బాలకృష్ణయ్య, మోదలపల్లె

వ్యాధి నిర్ధారణ ఇక్కడే



ప్రతి రోజూ తల, కళ్లు తిరుగుతుండడంతో విలేజీ క్లినిక్‌లో పరీక్షలు చేయించుకొన్నాను. బీపీ లేదని డాక్టర్లు ధ్రువీకరించారు. వేరే మందులు ఇచ్చారు. ఇప్పుడు బాగుంది. సంతోషంగా ఉన్నాను. ఏ జబ్బు వచ్చినా ఇంటి ముంగిటే వైద్య సేవలు అందుతున్నాయి.

- శారద, దిగువ మోదలపల్లె

జగనన్నకు రుణపడి ఉంటాం



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇంటి ముంగిటే వైద్యం అందించి ప్రజల గుండెల్లో నిలుస్తున్నారు. అందుబాటులో వైద్యం చేయించుకునే సౌకర్యం కలిగింది. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

- శ్వేత, వినాయక పురం

వైద్యానికి భయం లేదు



గతంలో వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామంలోనే విలేజ్ హెల్త్ క్లినిక్ ఉండడంతో అందుబాటులో వైద్యం చేయించుకుంటున్నాం. అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తుడండంతో గ్రామీణులకు వైద్యానికి ఇక్కట్లు తప్పాయి.

- సులోచనమ్మ, చిన్న వెంకటంపల్లె

ప్రజా సేవకుడిగా పనిచేస్తున్నా



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: గంగాధరనెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి తాను ప్రజా సేవకుడిగా శ్రమిస్తున్నానని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. సీఎం జగనన్న ఆశయాలు, ఆలోచనలతో పేదల సంక్షేమమే పరమావధిగా...అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను సమితి అధ్యక్షుడిగా ఇక్కడి ప్రజల కష్టాలు తెలిసిన వాడిగా, ఓ కుటుంబ సభ్యుడిగా ఉంటూ సేవకుడిగా పనిచేస్తున్నట్లు చెప్పారు. 75 సంవత్సరాలుగా జరగని అభివృద్ధి సీఎం జగనన్న సారథ్యంలో గ్రామాల్లో చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 90 గ్రామాల్లో ఆలయాల అభివృద్ధి, పెనుమూరు, కార్వేటినగరం మండలాల్లో 5 పడకల ఆస్పత్రి, వెదురుకుప్పానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్ల అభివృద్ధి జరిగినట్లు చెప్పారు. 'నేను లంచాలు, కమీషన్లు తీసుకుని పనులు చేయ లేదు.. ప్రజలకు డబ్బులిచ్చి ఓట్లు వేయించుకోలేదు.. నాకు ఎటువంటి వ్యాపారాలు లేవు...పేదవాడి కోసం, నమ్ముకున్న వాళ్ల కోసం ఎంత వరకైనా పోరాడతా' అని చెప్పారు. పేదలు పేదవాడిగానే ఉండాలన్న దుర్బుద్ధితో చంద్రబాబు, పవన్, ఎల్లో మీడియా పని గట్టుకుని నిత్యం దుష్ప్రచారం చేస్తున్నట్లు మండి పడ్డారు. అవాస్తవాలు, అసత్యపు ప్రచారాలతో ప్రజలను మభ్య పెట్టాలని కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ఎవరెన్ని చేసినా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని నారాయణస్వామి ధీమా వ్యక్తం చేశారు.

కొత్త సంబరం



చిత్తూరులో ఓ బేకరీలో కేకుల సందడి

జిల్లా అంతటా ఆదివారం రాత్రే ఆంగ్ల నూతన సంవత్సర సంబరాలు మిన్నంటాయి. అర్ధరాత్రి దాటగానే చిన్నాపెద్ద తేడా లేకుండా వీధుల్లోకి వచ్చి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొట్టారు. కేక్ కటింగ్‌లు, బాణసంచా పేలుళ్ల హోరుతో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించారు. సోమవారం శుభాకాంక్షలు తెలిపేందుకు కేక్‌లు, పూల బొకేలు, స్వీట్స్ కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో దుకాణాలు రద్దీగా మారాయి. ఆలయాలు విద్యుద్దీప కాంతులతో అలరారాయి. నగరిలో 2024ను ఆహ్వానిస్తూ ఓ హోటల్‌లో వేసిన దోసె ఆకర్షించింది.

- సాక్షి నెట్‌వర్క్



నగరి: ఒక హోటల్‌లో 2024ను ఆహ్వానిస్తూ వేసిన దోసె



పలమనేరులో వెరైటీ కేకులు

కృష్ణా జలాలు వచ్చేశాయ్



కుమ్మరమడుగు వద్దకు చేరుకున్న కృష్ణా జలాలు

వి.కోట: హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు ఆదివారం మండలంలోకి రావడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మండలంలోని కృష్ణాపురం గ్రామ రెవెన్యూలోని కుమ్మర మడుగు సమీపంలోకి కృష్ణా జలాలు ప్రవేశించడంతో రైతులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మండలం మీదుగా జలాలు కుప్పానికి చేరుతాయని అధికారులు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతుల కోసం ప్రారంభించిన హంద్రీ-నీవా కాలవ పనులు ఆయన తనయు డు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పూర్తయి మండలంలో తాగు, సాగు నీటి సమస్య తీరిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సమస్యలు, ఎంతో వ్యయంతో కూడుకున్న ఈ కాలువ పనులను పూర్తి చేసి కృష్ణా జలాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు.

5 లడ్డూ కౌంటర్లకు ఎస్బీఐ స్పాన్సర్ షిప్



నూతన ఎస్బీఐ లడ్డూ కౌంటర్లను ప్రారంభిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, బ్యాంకు ఎండీ శ్రీనివాసశెట్టి

తిరుమల: తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌లో గల 5 కౌంటర్లకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్ షిప్ అందించింది. ఈ మేరకు ఆయా కౌంటర్లలో ఆదివారం ఉదయం టీటీడీ ఈఓ ఏవీ. ధర్మారెడ్డి, బ్యాంకు ఎండీ శ్రీనివాసశెట్టి పూజలు చేసి ప్రారంభించారు. ఇకపై ఈ ఐదు కౌంటర్లను బ్యాంకు నిర్వహిస్తుంది. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం, పోటు పేష్కార్ శ్రీనివాసులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం



మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ




మారేడు మొక్క నాటుతున్న కమిషనర్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సూచించారు. ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, తీర్థ ప్రసాదాలు చిత్రపటం చైర్మన్, ఈఓ అందించారు. అనంతరం ఆయన ఆలయ పరిసరాలను, అభివృద్ధి కార్యక్రమాలను కమిషనర్ పరిశీలించారు. అద్దాల మండపం వెనుక మారేడు మొక్కను నాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అతిథి గృహంలో సమావేశం

ఆలయ అభివృద్ధి పనులపై చైర్మన్, ఈఓ, అధికారులతో కమిషనర్ సత్యనారాయణ సమావేశమయ్యారు. మాస్టర్ ప్లాన్ నివేదికలు పరిశీలించారు. నిర్మాణాలు పూర్తి అయిన భవనాలను జనవరిలో ప్రారంభించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం మిగిలిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

పెంచలకోనకు 'నూతన' శోభ



దేదీప్యంగా పెనుశిల క్షేత్రం

రాపూరు : పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలకు ముస్తాబైంది. పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఆలయంలో విద్యుద్దీపాలతోపాటు వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేసినట్లు వివరించారు. భక్తులు ఇబ్బంది పడకుండా తాగునీరు, అన్న ప్రసాద వితరణ చేపడుతున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

కోలాహలంగా మైలేరు


పరుగులు తీస్తున్న ఎద్దులు

పలమనేరు: మండలంలోని నూనేవారిపల్లెలో ఆదివారం మైలేరు(ఎద్దుల పరుగుపందాలు) కోలాహలంగా జరిగాయి. యువకుల కేరింతలతో గ్రామంలో సందడి నెలకొంది. పొరుగు రాష్ట్రాల నుంచి సైతం యువకులు ఎద్దులను పోటీలకు తీసుకువచ్చారు. వేగంగా పరుగెత్తిన ఎద్దులకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. కొందరు గాయపడినట్లు సమాచారం. పోటీలకు అనుమతులు లేన్నప్పటికీ పోలీసుల ఉదాశీనత కారణంగానే మూగ జీవాలను హింసిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆనవాయితీగా నిర్వహించే మైలేర్లు కొందరికి కాసులు కురిపించే ఆదాయంగా మారిందనే మాట వినిపిస్తోంది. పోలీసులు నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని మండల వాసులు కోరుతున్నారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

రొంపిచెర్ల: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో 369 ఇళ్ల పట్టాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోటా వెంకటరమణ ఆదివారం తెలిపారు. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని జగనన్న లే అవుట్‌లో 234 మందికి, బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలోని పెద్ద చెరువులో ఇళ్లు నిర్మించుకున్న 135 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తారని తెలియజేశారు.

దేవళంపేటలోని ఆలయంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలో దేవళంపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద సోమవారం నిర్వహించే వేడుకల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాదముని రెడ్డి తెలిపారు.

సామాజిక సేవలో సర్కారు

- అందుబాటులోకి జగనన్న సమావేశ మందిరాలు
- సామాన్య ప్రజలకు ఉపయోగపడుతున్న వైఎస్సార్ రిసెప్షన్ హాళ్లు
- ప్రజలకు బాసటగా కమ్యూనిటీ టాయిలెట్లు

నగరి : గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను చేయలేక చేతులెత్తేస్తే.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీలతో పాటు మరిన్ని సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తోంది. సామాజిక పరమైన అవసరాలను అందుబాటులోకి తేవడంలో ప్రత్యేకతను చాటుకుంది. ఇందులో భాగంగా జగనన్న సమావేశ మందిరాలు, డాక్టర్ వైఎస్సార్ రిసెప్షన్ హాళ్లు, కమ్యూనిటీ టాయిలెట్లు వంటివి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

జగనన్న సమావేశ మందిరాలు..

నగరి పట్టణానికి మూడు జగనన్న సమావేశ మందిరాలు మంజూరు కాగా, వీటిలో నేత్రదేవత దేశమ్మ అలయ ఆవరణలో నిర్మిస్తున్న సమావేశ మందిరం, కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయం సమీపంలో నిర్మిస్తున్న సమావేశ మందిరం దాదాపు పూర్తయింది. సత్రవాడ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో సమావేశ మందిర నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. ఈ సమావేశ మందిరాల్లో ఎలాంటి రుసుం లేకుండా సమావేశాలు, వార్డు సభలు జరుపుకోవచ్చు. ఆలయాల్లో వివాహాలు చేసుకునే పేదలు సమీపంలో ఉన్న సమావేశ మందిరాల్లో రిసెప్షన్ నిర్వహించుకుని వేడుకలను ఉచితంగా జరుపుకోవచ్చు. వార్డు ప్రజలు పుట్టిన రోజు వేడుకలు, నిశ్చితార్థ వేడుకలు లాంటి చిన్నపాటి సంబరాలను ఈ మందిరాల్లో ఉచితంగా చేసుకోవచ్చు. వర్షాకాలంలో నిరాశ్రయులైన వారికి ఈ సమావేశ మందిరాలు విడిదిగా ఉపయోగపడతాయి.


కీళపట్టు వద్ద నిర్మాణంలో ఉన్న జగనన్న సమావేశ మందిరం


మిట్టపాళెం కార్యాలయ సముదాయాల వద్ద నిర్మించిన శానిటరీ కాంప్లెక్స్

డాక్టర్ వైఎస్సార్ రిసెప్షన్ హాలు..

పుత్తూరు పట్టణానికి రెండు వైఎస్సార్ రిసెప్షన్ హాళ్లు మంజూరు కాగా అవి నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పుత్తూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఒక హాలు, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒక హాలు నిర్మించారు. స్పందన కార్యక్రమానికి అర్జీలు సమర్పించడానికి కార్యాలయాలకు వచ్చేవారు, వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చేవారు విశ్రాంతి తీసుకోవచ్చు.

కమ్యూనిటీ టాయిలెట్లు..

కార్యాలయ సమూహాలు, బస్టాండు ప్రాంగణాలు ఉన్న పలు ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మించారు. కార్యాలయాలకు విచ్చేసేవారు, బస్టాండు ప్రాంగణంలో వేచి ఉండేవారు ఉచితంగా కాలకృత్యాలు తీర్చుకోవడానికి, పరిసరాలు అపరిశుభ్రం కాకుండా శుభ్రత పాటించడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. ఇవి వినియోగంలోకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

నియోజకవర్గంలోని వార్డులు	: 53
నియోజకవర్గంలోని పంచాయతీలు	: 97
నియోజకవర్గ జనాభా	: 2,66,703
నియోజకవర్గ విస్తీర్ణం	: 34.45 చదరపు కి.మీ.
ఒక్కో జగనన్న సమావేశ మందిరానికి వెచ్చించిన నిధులు	: రూ.30 లక్షలు
ఒక్కో డాక్టర్ వైఎస్సార్ రిసెప్షన్ హాలుకు వెచ్చించిన నిధులు	: రూ.7.5 లక్షలు
ఒక్కో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌కు వెచ్చించిన నిధులు	: రూ.3 లక్షలు


పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన వైఎస్సార్ రిసెప్షన్ హాలు



పుత్తూరు-తిరుపతి రోడ్డులో నిర్మించిన శానిటరీ కాంప్లెక్స్


పుత్తూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్మించిన వైఎస్సార్ రిసెప్షన్ హాలు

ప్రజలతో సామరస్యంగా మెలగాలి


మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్ రెడ్డి

చిత్తూరు అర్బన్: ప్రజలతో సామరస్యంగా, సఖ్యతతో చట్టంపై గౌరవం పెంపొందేటట్లు మెలగాలని పోలీసు అధికారులకు ఎస్పీ రిశాంత్‌రెడ్డి సూచించారు. చిత్తూరు నగరంలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ఆదివారం వార్షిక నేర సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సహకారంతో క్లిష్టతరమైన కేసులను సైతం చేధించి బాధితులకు సకాలంలో న్యాయం చేయగలిగామన్నారు. ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ 2024లో కూడా ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన నేరాస్తులపై నిఘా ఉంచాలన్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ఉండాలని తెలిపారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసులపై తక్షణమే స్పందించాలన్నారు. సమావేశం అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని నగదు బహుమతితో అభినందించారు. అడిషనల్‌ఎస్పీ సుధాకర్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే సంక్షేమం


బసవరాజును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

సోమల : అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎస్సీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు బసవరాజు తెలిపారు. వైనాట్ 175కి మద్దతుగా నవంబర్ 17 నుంచి ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు రెండువేల కిలోమీటర్ల పాదయాత్రకు నాంది పలికిన ఆయన, ఆదివారం దాదాపు 800 కిలోమీటర్లు పూర్తి చేసి సోమల మండల కేంద్రానికి చేరుకున్నారు. ఇక్కడ ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాధికారతే లక్ష్యంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు పన్నినా 2024లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు సన్మానించారు. దళితులు, మైనారిటీలు, బీసీలు జగనన్నకు అండగా నిలవాలని ఆయన కోరారు. వైస్ ఎంపీపీ ప్రభాకర, సింగిల్ విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, వాటర్ షెడ్ వైస్ చైర్మన్ పీఎల్‌ఆర్ రాజారెడ్డి, సర్పంచులు రెడ్డెప్ప, వీ.వెంకటరమణ, సురేంద్రరెడ్డి, వరదం రమణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మొగిళప్పగారి శ్రీనివాసులు, బగ్గిడి నాగరాజ, గౌస్‌పీర్, సాంబయ్య, రమణ, తాతమల్లయ్య ప్రదీప్, రాజగోపాల్ పాల్గొన్నారు.

తుమ్మలగుంటకు సరి'కొత్త' శోభ!

- నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం
- ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ
- కనువిందు చేస్తున్న స్వాగత తోరణాలు


ముస్తాబైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

తిరుపతి రూరల్ : తుమ్మల గుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం సరికొత్త శోభను సంతరించుకుంది. నూతన సంవత్సర వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. విశేష సంఖ్యలో తరలిరానున్న భక్తులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన తోరణాలు ఆకట్టుకుంటున్నాయి. విద్యుద్దీపాలు, వివిధ పుష్పాలంకరణలో ఆలయం దేదీప్యంగా ప్రకాశిస్తోంది. ఆలయంలో ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా పకడ్బందీగా క్యూలు ఏర్పాటు చేశారు. గత ఏడాది రద్దీని దృష్టిలో పెట్టుకుని పక్కాగా పార్కింగ్ సౌకర్యం కల్పించారు. తెలుగు తల్లి విగ్రహం నుంచే వాహనాలకు అనుమతి లేకుండా చర్యలు తీసుకున్నారు. టీటీడీ డెయిరీ ఫామ్ ఆవరణలో వాహనాలు పార్క్ చేసేందుకు స్థలం ఏర్పాటు చేశారు. అలాగే జాతీ య రహదారిపై నుంచి తుమ్మలగుంట ఆలయంకు వచ్చే వాహనాలను తుమ్మల గుంట చెరువు వద్ద పార్క్ చేసేలా పోలీసులు స్థలాలను సిద్ధం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

7న శ్రీకృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణ


చౌడేపల్లె : మాట్లాడుతున్న టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్

చౌడేపల్లె/సోమల/సదుం/పులిచెర్ల(కల్లూరు): పుంగనూరు-మదనపల్లె మార్గంలోని భీమగానిపల్లె సమీపం వద్ద జనవరి7వ తేదీ శ్రీకృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణకు బలిజ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జానపద కళల దృశ్య అకాడమి చైర్మన్ కొండవీటి నాగభూషణం పిలుపునిచ్చారు. ఆదివారం చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల మండలాలలో బలిజ కులస్తులు, ప్రముఖులతో పోకల సమావేశం నిర్వహించారు. విగ్రహావిష్కరణ పత్రికలు ఆవిష్కరించి మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ శేషుతోపాటు పలువురు ప్రముఖులు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, ఎంపీపీలు రామమూర్తి, వైస్ ఎంపీపీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, బోయకొండ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, ఆయా మండలాల పార్టీ కన్వీనర్లు, ఎంపీటీసీ పోకల చంద్ర, పలువురు బలిజ సంఘ నేతలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి దౌర్జన్యం


కుమ్మరగుంట వీధిలో పూడ్చేసిన డ్రైనేజీ

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని కుమ్మరగుంట వీధిలో ప్రభుత్వం ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షలతో నూతనంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టింది. అయితే బీజేపీ నాయకుడు కోదండపాణి మొదలియార్ దౌర్జన్యంగా డ్రైనేజీని పూడ్చివేశారు. దీంతో ఆదివారం కుమ్మరగుంట వీధికి చెందిన ముస్లిం మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న మురుగునీటి కాలువను పూడ్చిన కోదండపాణిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వ్యక్తిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులకు ముస్లింల అభివృద్ధి గిట్టదని, అందుకే వారు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డ్రైనేజీని పూడ్చిన వ్యక్తిని కఠినంగా శిక్షించి అతనితోనే డ్రైనేజీ నిర్మాణం చేయించాలని డిమాండ్ చేశారు.

నగల చోరీలో ముగ్గురిపై కేసు

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట ఏలుమలై వీధిలో ఉన్న ఎస్ఎస్ జ్యువెలరీలో శనివారం రాత్రి చోరీకి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ నిందితులు మారణాయుధాలతో దుకాణం యజమాని కార్తీక్, తదితరులను భయభ్రాంతులకు గురిచేసి రూ.2.90లక్షల విలువైన బంగారు నగలను దోచుకెళ్లినట్లు వెల్లడించారు. 22 గ్రాముల గొలుసు, 8 గ్రాముల చైన్, 8 గ్రాముల పచ్చరాతి ఉంగరం, 12 గ్రాముల 3 బంగారు వెంకటేశ్వర స్వామి ప్రతిమల ఉంగరాలతో మొత్తం 50 గ్రాముల నగలను అపహరించారని వివరించారు. దోపిడీ అనంతరం దుండగులు రోడ్డుపై వెళుతున్న ఓ వ్యక్తిని బెదిరించి రూ.50వేల విలువైన ఏపీ 03 ఏపీ 1190 ద్విచక్ర వాహనాన్ని లాక్కొని వెళ్లినట్లు చెప్పారు. బాధితుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే రేణిగుంట మండలం పరిసర ప్రాంతాలకు చెందిన విశ్వ, రాజేష్, ఆనంద్ అనే యువకులే దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారని సమాచారం. ఆ మేరకు ఇప్పటికే విశ్వ, రాజేష్‌ను అదుపులోకి సైతం తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో అటెండర్ మృతి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : నాయుడుపేట-పూతలపట్టు రహదారిపై తొండమనాడు ఆర్చి వద్ద ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని గురుకుల పాఠశాల అటెండర్ మృతి చెందాడు. వివరాలు.. నారాయణవనం మండలం, లక్ష్మీపురం ఎస్టీ కాలనీకి చెందిన పురుషోత్తం(48) రేణిగుంటలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై శ్రీకాళహస్తి వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

సాధారణంగా కొత్త సంవత్సరం వస్తోంది అంటే ఎన్నో సంబరాలు. సంవత్సరంతో పాటు తమ జీవితాలలో కూడా మార్పు వస్తుందనే ఆశతో అందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతూ ఉంటుంది. ఎవరి పద్ధతులలో వారు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ళని, వీధులని, నగరాలని అలంకరిస్తారు. అలంకారాలు, దీపాలు, టపాకాయలు, కొత్తబట్టలు, మిఠాయిలు (ఎక్కువగా కేకు) పంచుకోవటాలు, విందులు, వినోదాలు, శుభాకాంక్షలు. అంటే రాబోయే కాలం ఆనంద దాయకంగా ఉండాలనే ఆకాంక్ష, ఉంటుందనే విశ్వాసం వ్యక్తం చేయటమే వీటిలోని అసలు అర్థం.

కొత్త సంవత్సరం

మంచి మాట

కొత్త ఆశలు, ఆశయాలు



మనిషి ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుండి లెక్కించటం కూడా ప్రారంభించాడు. ప్రకృతిలో వస్తున్న మార్పులని పరిశీలించి, తదనుగుణంగా ఉండటం కోసం కాలాన్ని కూడా గణించటం ప్రారంభించాడు. కాలగణనకి ప్రమాణం ప్రకృతిలో జరిగే పరిణామాలే. కొద్దికాలం జరిగిన తరవాత మళ్ళీ ఇంతకు ముందు ఉన్నట్టే ప్రకృతి కనపడితే ఈ క్రమం ఏమిటి? అన్నది అర్థం చేసుకునే ప్రయత్నంలోనే మనిషి కాలాన్ని లెక్కపెట్టటం జరిగింది. లెక్కపెట్టటం ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు మొదలుపెట్టాలి. ఒక్కొక్క ప్రాంతం వారు వారికి అనుకూలంగా ఉన్న సమయం నుండి లెక్కపెట్టటం మొదలుపెట్టారు. కాలక్రమంలో దానిలో ఒక హేతుబద్ధతని అవలంబించారు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండే సమయాన్ని కాలాన్ని లెక్కకట్టటానికి మొదలుగా తీసుకున్నారు. పాశ్చాత్యులకి ఆహ్లాదకరంగా ఉండే వసంతం (స్ప్రింగ్) మార్చ్, ఏప్రిల్ నెలలు. మార్చ్ 23 ని సంవత్సర మానానికి ఆదిగా పరిగణించే వారు. తరువాత నెల మధ్యలో ఎందుకని ఏప్రిల్ 1 ని సంవత్సరాదిగా జరుపుకునే వారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల అది జనవరి 1 కి మారింది. మార్చ్ మొదటి నెల కనుక డిసెంబర్ 10 వ నెల, నవంబర్ 9 వ నెల, అక్టోబర్ 8 వ నెల, సెప్టెంబర్ 7 వ నెల అయ్యాయి. ఆ పేర్లే నెలల సంఖ్యని తెలియ చేస్తున్నాయి. ఈ కాలెండర్ ని గ్రెగేరియన్ కాలెండర్ అంటారు. అందరికీ తమ కాలెండర్ ఉన్నా, ఇప్పుడు ప్రపంచం అంతా ఈ కాలెండర్‌నే అనుసరిస్తోంది.

ఈ కాలెండర్ ప్రకారం జనవరి ఒకటో తారీకుతో కొత్త సంవత్సరం మొదలు అవుతుంది. సౌరమానాన్ని అనుసరించి ఒక సంవత్సరంలో 365 1/3 రోజులు ఉంటాయి. అందుకని నాలుగు సంవత్సరాలకి ఒక మారు లీప్ ఇయర్ అని ఒక రోజు అధికంగా వస్తుంది. ఆ రోజు తక్కువ రోజులు ఉండే ఫిబ్రవరికి వెడుతుంది.

అయితే ఆనందోత్సాహాలు ఎందుకు? ఇంతకాలం జీవితాన్ని ఆనందంగా గడిపినందుకు. ఆ విధంగా గడిపే అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు. సంవత్సరంలో మొదటి రోజు ఏ విధంగా గడిపితే సంవత్సరం అంతా అదేవిధంగా ఉంటుందని అందరి విశ్వాసం.

రెండువేల ఇరవై నాలుగవ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలని ఆనందాన్ని ఇతోధికంగా ఇవ్వాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఒకరికొకరం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుందాము.

అనుభవజ్ఞులైన పెద్దలు చేసే సూచన ఏమంటే జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశాము అని సమీక్షించుకుని, గెలుపోటములని, మానావమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్ష్యసాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకి పెట్టి, అవసరమైన వాటిని చేపట్టటానికి నిర్ణయించుకో వలసిన సమయం ఇది అని. తమ ఆయుర్దాయంలో మరొక సంవత్సరం గడిచిపోయింది, చేయవలసిన పనులు త్వరగా చేయాలి అని తమని తాము హెచ్చరించుకోవాలి. అందుకే ఎంతోమంది ఒక చెడు అలవాటుని మానుతామనో, కొత్తపని ఏదైనా మొదలు పెడతామనో అని నూతన సంవత్సర నిర్ణయాలని ప్రకటిస్తూ ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

మనం అందరం కారణజన్ములం. ఏదో ఒక ప్రత్యేకమైన గొప్ప పని చేసేందుకు ఈ భూమిపై జన్మించాం. ఇంత గొప్ప అవకాశం వృథా చేసుకోకండి. ఈ సంవత్సరం ఏదైనా కొత్త, సృజనాత్మకమైన పని మొదలుపెట్టండి. ఏదైనా కొత్త పని చేయకుండా ఏ సంవత్సరమూ గడచిపోకూడదు. మీకు ఏ కలలూ లేకపోతే, వాటిని నిజం చేసుకోలేరు కదా! ఏ కొత్త ఆవిష్కరణ అయినా ఒక కలతో మొదలవుతుంది. ఉన్నతంగా కలలుగనే, ఆలోచించే స్వేచ్ఛని మీకు మీరు ఇచ్చుకోండి. ఆపై, వాటిని సాధించేందుకు నూరుశాతం ధైర్యంతో, సమర్పణభావంతో పనిచేయండి.

ఒక అసాధ్యాన్ని సాధిస్తా!

ఈ భూమిని మరింత గొప్పగా తీర్చిదిద్దుతా


చాలాసార్లు ఉన్నతమైన కలలు కనేవారిని ఇతరులు అపహాస్యం చేశారు. కానీ వారు వెనక్కు తగ్గకుండా, తమ లక్ష్యాలను సాధించేవరకూ స్థిరంగా నిలబడ్డారు.

మనలో ఉండే ప్రాణశక్తి ప్రవహించేందుకు ఒక దిశను చూపటం అవసరం. దానికి సరైన దిశను చూపకపోతే మీరు గందరగోళంలో చిక్కుకుపోతారు. జీవశక్తి ఒక నిర్దిష్ట దిశలో పయనించేలా చేయాలంటే మనకు నిబద్ధత అవసరం. ఈ రోజున చాలామంది, తమ జీవితానికి ఒక నిర్దిష్టమైన లక్ష్యం, దిశానిర్దేశం లేకపోవడం చేత అయోమయంలో ఉన్నారు. మీరు ఆనందంగా ఉన్నప్పుడు మీ ప్రాణశక్తి తారాస్థాయిలో ఉంటుంది, మరి అంత ఎక్కువగా ఉన్న ఆ ప్రాణశక్తికి, ఎటువెళ్లాలో చెప్పకపోతే, అది అక్కడే చిక్కుకుపోతుంది. ఒకేచోట పేరుకుపోతే ఏమౌతుంది? కుళ్ళిపోయి, పనికి రాకుండా పోతుంది.

ఇక్కడ రహస్యం ఏమిటీ అంటే, మన లక్ష్యం పట్ల నిబద్ధత ఎంత గొప్పగా ఉంటే, దాన్ని సాధించేందుకు అంత గొప్ప శక్తి మనకు లభిస్తుంది.

లక్ష్యం ఎంత గొప్పగా ఉంటే, పనులు అంతా సులభంగా, తేలికగా జరిగిపోతాయి. అదే చిన్న లక్ష్యాలు పెట్టుకున్నారనుకోండి, ఎందుకంటే మీలో సామర్థ్యం కొండంత ఉంది, మీరేమో ఈ చిన్న పనిలో ఇరుక్కుపోయారు అనిపించి మీకే చికాకుగా ఉంటుంది.

మీరు సమాజం బాగు కోసం పనిచేస్తున్నప్పుడు, మీరు పది పనులు చేస్తున్నారనుకుందాం. వాటిలో ఒక పనిలో పొరపాటు జరిగినా, మిగతా తొమ్మిది పనులూ చేస్తూ ఉంటే, ఈ మొదటి పనిలో పొరపాట్లు వాటంతట అవే సర్దుకుంటాయి. సాధారణంగా కృప అనేది ఇలా పనిచేస్తుంది. మొదట అవసరమైన వనరులు సమకూరితే, అప్పుడు పెద్ద లక్ష్యం పెట్టుకుని పని చేద్దామని మనం సాధారణంగా అనుకుంటాం. కాని, మొదట మీ లక్ష్యం గొప్పగా ఉంటే, వనరులు వాటంతట అవే సమకూరుతాయి. మనం పెట్టుకున్న లక్ష్యమే మనకు ఆ శక్తిని బహుమతిగా ఇస్తుంది. మీరు మీ కుటుంబ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్నారనుకోండి, ఆ కుటుంబమే మీకు సహాయం చేస్తుంది. మీరు సమాజం మొత్తానికి గొప్ప పనిచేయాలని సంకల్పించుకుంటే సమాజం మొత్తం మీకు సహాయపడటాన్ని మీరే చూస్తారు. మీకు కావలసిన సహాయం మీరు అడక్కముందే వచ్చి చేరుతుంది.



గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

మనస్సు పూర్తిగా వర్తమానంలో ఉన్నప్పుడు, మీకు సరైన ఆలోచనలు వస్తాయి. లక్ష్యాలు పెట్టుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సాధించే విధానం కూడా ప్రణాళిక వేసుకోవాలి. మూడేళ్ళ తర్వాత మిమ్మల్ని మీరు ఎలా చూడాలనుకుంటున్నారు? ఒక ఇరవై ఏళ్ల తర్వాత? నలభై ఏళ్ళ తర్వాత? ఫలితం గురించి ఎక్కువ ఆలోచించకుండా మీ విధిని నూరు శాతం నిర్వర్తించండి.

మీ నిబద్ధతకు ఆశించిన ఫలితం రావాలంటే సరైన ఆలోచనలు, సరైన చర్యలు రెండూ అవసరమే. మీరు సాధించాలనుకుంటున్న అన్ని విషయాలతో పెద్ద చిట్టా తయారు చేసుకోకండి. స్థూలంగా పరిశీలించి, నిజంగా అవసరమైన కొన్ని లక్ష్యాలను ఎంచుకోండి. మనకు అత్యంత సంతృప్తిని ఇచ్చే వాటిని, దీర్ఘకాలంలో పదిమంది జీవితాలను తీర్చిదిద్దే వాటిని ఎంచుకుని పని చేసినపుడు, మిగిలిన చిన్నాచితక విషయాలు వాటంతట అవే గాడిలో పడతాయి.

సాధారణంగా మనం మనసులో తపన పడుతూ ఉంటాము, కానీ మన చర్యలు నెమ్మదిగా ఉంటాయి. విజయానికి సోపానం ఏమంటే, మనసులో ఓరిమి, పనిలో ఉత్సాహం. అభిరుచిని, వైరాగ్యాన్ని సరిసమానంగా స్వీకరించండి. మీ లక్ష్య సాధనకై ధైర్యంగా ముందుకు సాగండి, అవసరమైనప్పుడు వదిలేయడం కూడా నేర్చుకోవాలి. అపుడు సహజంగా సమృద్ధి చేకూరుతుంది.

మీరు ధ్యానం చేసినపుడు మీరు సూక్ష్మంగా గమనించగలుగుతారు. మీకు పూర్తిగా విశ్రాంతి లభిస్తుంది, అదే సమయంలో బుద్ధి, వివేచన, సద్యఃస్ఫూర్తి వృద్ధి చెందుతాయి. మీరు ఎఱుకతో ఉండి పనిచేస్తే అది సరైన పని అవుతుంది. చెదిరిపోని దృష్టి, సద్యఃస్ఫూర్తితో పనిచేసే మనసు మీ లక్ష్యాన్ని సాధించేందుకు సహాయ పడతాయి. ఒత్తిడి లేని, ఉత్సాహభరితమైన జీవితానికి, మీరు అనుకున్న లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో పనిచేసేందుకు సరైన మార్గం ధ్యానం.

నిబద్ధత అనేది దీర్ఘకాలంలో ఎప్పుడూ సుఖాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచాన్ని మరింత సురక్షితంగా జీవించే అద్భుత ప్రదేశంగా మార్చాలని కంకణం కట్టుకోండి. అసాధ్యమైన కల కనండి!

● ముగ్గు ముచ్చట



ముగ్గులకు ఆహ్వానం



26 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు



గుంటి శైలజ
మూసాపేట
హైదరాబాద్

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

సినిమా



● రజనీకాంత్

కన్యాకుమారిలో వేటగాడు

కన్యాకుమారిలో తిరుగుతున్నాడు వెట్టయాన్ (తెలుగులో 'వేటగాడు' అని అర్థం). రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వెట్టయాన్'. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా తాజా చిత్రీకరణ కన్యాకుమారి పరిసరాల్లోని లొకేషన్స్‌లో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్, ఫాహద్ ఫాజిల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ నటిస్తున్నారని, నకిలీ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. సుభాస్కరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.

వాస్తవ ఘటనలతో సర్కారు నౌకరి

ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భావన హీరోయిన్‌గా నటించారు. ఆర్కే టెలీ షో బ్యానర్‌పై డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో గంగనమోని శేఖర్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో 90వ దశకం నేపథ్యంలో 'సర్కారు నౌకరి' రూపొందింది. ఇందులోని సందేశం, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''సర్కారు నౌకరి'లో ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు ఆకాష్. ''ఈ మూవీతో తెలుగులో పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు భావన.



● ఆకాష్, భావన



● విజయ్

విజయ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనే టైటిల్ ఖరారైంది. విజయ్ కెరీర్‌లో 68వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. న్యూ ఇయర్ (2024) సందర్భంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాకు సంబంధించిన మరో లుక్ నేడు రానుందని కోలీవుడ్ సమాచారం. ఫస్ట్‌లుక్‌ని చూస్తే ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని స్పష్టమవుతోంది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, లైలా, స్నేహ, జయరాం, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదలకానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.



● నరేశ్, నాగార్జున, రాజ్‌తరుణ్

మా జోలికొస్తే నా సామిరంగ!

''మా జోలికొస్తే.. మాకడ్డు వస్తే.. మామూలుగా ఉండదు.. నా సామిరంగ..' అంటూ పాడేస్తున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలకానుంది. ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'నా సామిరంగ..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను కాల భైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. 'మా జోలికొస్తే మాకడ్డు వస్తే మామూలుగా ఉండదు నా సామిరంగ.., ఈ గీత తొక్కితే మా సేత సిక్కితే మామూలుగా ఉండదు నా సామిరంగ..' అంటూ ఫుల్ జోష్‌లో సాగే ఈ పాటలో నాగార్జునతో కలిసి 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కూడా చిందేశారు. ''మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నా సామిరంగ' రూపొందింది. ప్రధాన తారాగణంతో పాటు 300 మంది డ్యాన్సర్స్‌తో లావిష్‌గా చిత్రీకరించిన 'నా సామిరంగ..' పాటకు దినేష్ మాస్టర్ అందించిన నృత్యాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరధి.



అది మరచిపోలేని జ్ఞాపకం

– శివాత్మిక రాజశేఖర్

''నేను ఎప్పట్నుంచో స్కై డైవింగ్ చేయాలనుకుంటున్నాను. అది 2023లో నెరవేరింది. దుబాయ్‌లో అక్క(శివాని), నేను రెండు వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేశాం. 2023 అనే కాదు.. నా జీవితంలోనే నేను మరచిపోలేని జ్ఞాపకంగా ఈ స్కై డైవింగ్ అడ్వెంచర్‌ను గుర్తు పెట్టుకుంటాను'' అని హీరోయిన్ శివాత్మిక అన్నారు. 2023కి వీడ్కోలు పలుకుతూ 2024కి స్వాగతం పలుకుతున్న శివాత్మిక రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...

■ **మీ జీవితంలో 2023 ఎలా గడిచింది?**

చెప్పాలంటే... 2023 నాకు గొప్పగా గడిచింది. చాలా విధాలుగా కలిసొచ్చింది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే మంచి ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాననే భావన కలిగింది. ఎప్పట్నుంచో నేను చేయాలనుకుంటున్న పనులు ఈ ఏడాది జరిగాయి. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. నన్ను నేను మెరుగుపరచుకోవడం కోసం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నాను. కుటుంబం పరంగా కూడా బాగా గడిచింది. దేవుడి దయవల్ల, అదృష్టంగా 2023 నా జీవితంలో సంతోషంగా ముగిసింది.

■ **ఈ ఏడాది మీ జీవితంలో జరిగిన చెడు ఘటనలు ఏవైనా ఉన్నాయా?**

మంచి జరిగినట్లే... ప్రతి ఏడాది చెడు కూడా ఉంటుంది. అయితే కొత్త సంవత్సరాన్ని మొదలు పెట్టబోయే ఈ తరుణంలో వాటిని నేను గుర్తుతెచ్చుకోవాలనుకోవడం లేదు.

■ **కొత్త ఏడాది కోసం మీరు తీసుకున్న కొత్త నిర్ణయాలు ఏంటి?**

నా మనసును ఎక్కువగా ఫాలో అవుతూ వర్క్స్ చేస్తాను. ప్రతి అంశం గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రస్తుత క్షణాన్ని ఆస్వాదించేలా జీవిస్తాను. ఇలా గత ఏడాదిలో ప్రయత్నించి సంతోషంగా జీవనం సాగించాను. ఈ ఏడాది కూడా ఇదే ఫాలో అవ్వాలనుకుంటున్నాను.

■ **2024 మీ జీవితంలో ఎలా ఉండాలనుకుంటున్నారు?**

పెద్దగా అంచనాలు ఏమీ పెట్టుకోవడం లేదు. ఫ్లోను బట్టి ముందుకెళ్తాను. అయితే అన్నీ మంచి, గొప్ప అంశాలే జరగాలని కోరుకుంటున్నాను. సంతోషంగా, హాయిగా, ఆరోగ్యకరంగా గడవాలని ఆశిస్తున్నాను.

■ **కొత్త ఏడాదిని ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు?**

కొత్త ఏడాది ఎప్పటిలానే అమ్మానాన్న(జీవిత, రాజశేఖర్), అక్క శివానీలతో హైదరాబాద్‌లోనే సెలబ్రేట్ చేసుకుంటున్నాను. నా స్నేహితులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను కలుస్తాను.



● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

యాక్షన్ ఎంటర్‌టైనర్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బీఎస్ఎస్ 10'(వర్కింగ్ టైటిల్). 'భీమ్లా నాయక్' మూవీ తర్వాత సాగర్ కె.చంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా కీలక షెడ్యూల్ పూర్తయింది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బీఎస్ఎస్ 10'. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌ని గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు సాగర్ కె.చంద్ర. ఈ సినిమాలోని కీలకమైన షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ చిత్రంలో కొంతమంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.



● మృణాల్ ఠాకూర్



● లారెన్స్

లారెన్స్‌కు జోడీగా..?

హీరో రాఘవా లారెన్స్, హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. రాఘవా లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని టాక్. ఈ చిత్రంలో లారెన్స్‌కు జోడీగా మృణాళ్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను కూడా అనుకుంటున్నారట మేకర్స్. కాగా ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

దూడుం దుక్కుడుం బాగుంది

– జీవీ ప్రకాశ్ కుమార్



● శ్రీనాథ్, జీవీ ప్రకాశ్ కుమార్, ప్రణవ్, షాజ్ఞ, భువన్ రెడ్డి

''ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143' చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాట బాగుంది. ఈ సాంగ్‌కి క్లాసికల్ టచ్ ఇవ్వడం బాగా నచ్చింది. ఈ సినిమాలోని ఇతర పాటలు ఎలా ఉంటాయో అని ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం తప్పకుండా మ్యూజికల్ హిట్ అవుతుంది'' అని సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్ అన్నారు. ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు– 500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో బ్లాక్ యాంట్ పిక్చర్స్‌పై భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాటని జీవీ ప్రకాశ్ కుమార్ విడుదల చేశారు. శ్రీ సాయి కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ఈ చిత్రానికి కెమెరా: నిఖిల్ సురేంద్రన్, నేపథ్య సంగీతం: కమ్రాన్.